దయ్యం పట్టినవాడు

"ఏమండీ! ఫోను మీకే" అన్నది లోపలి నుంచి శారద. "ఎవరు?" అని అడిగాడు అనంతరామయ్య ముందు గదిలో పడక కుర్చీలో కూర్చుని ఉండి.

"ఆయనే మీ ఫ్రెండు. కొళందవేలు."

అనంతరామయ్య విసుగుతో, "ఇంట్లో లేనని చెప్పు. ఫోన్ పెట్టేసెయ్" అన్నాడు.

ఆమె అర్థంచేసుకుని ఉండాలి. మూడు రోజుల నుంచీ ఇదే తంతు. లోగొంతుకతో, "లేరండీ ఇంట్లో. ఇప్పుడే బయటికి వెళ్ళారు" అంటున్నది అనిష్టంగా.

తరువాత ముందు గదిలోకి వచ్చి భర్త ఎదురుగా నిలబడి, "ఏమిటి సంగతి?" అని అడిగింది.

"ఏముందీ? ఏమీ లేదు" అన్నాడు అనంతరామయ్య విరక్తిగా.

"కాదు. ఏదో ఉంది. మీరేదో దాస్తున్నారు. మొన్న ఆయన మన ఇంటికి వొస్తే అప్పటికప్పుడు మీరు చెప్పులు తొడుక్కుని ఏదో పనున్నట్టు మాటాపలుకూ లేకుండా, పలకరించనయినా పలకరించకుండా వెళ్ళిపోయారు. ఆయన చిన్నబుచ్చుకుని ఏమిటిలా వెళ్ళిపోయాడని నన్ను అడిగాడు. నేనేమి చెప్పను? నాకేమీ తెలియదన్నాను. ఫోను చేస్తే ఇంట్లో లేరని చెప్పిస్తున్నారు. ఏమిటి కథ? ఇప్పుడాయనకు జ్వరంట."

"సరేలే. సోది కట్టిపెట్టి కాస్త కాఫీ తెచ్చి ఇవ్వు." అనంతరామయ్య కంఠంలో గొప్ప చిరాకు.

శారద ఒక్క క్షణం భర్త ముఖంలోకి చూసి అంతలోనే ఏమనుకున్నదో ఏమో మరేమీ మాట్లాడకుండా లోపలికి వెళ్ళిపోయింది.

అనంతరామయ్య కుర్చీలో వెనక్కు వాలి కూర్చుని ఈల వేద్దామని ప్రయత్నించాడు. ఘోరమైన అపస్వరం పలికింది. విసుగనిపించింది.

శారద వచ్చింది. కాఫీ తాగుతూ ఉండగా, "చెప్పండి" అన్నది.

"ఏం చెప్పాలి?"

"అదే మీరు కొళందవేలుగారిని ఈ నాలుగైదు రోజులుగా ఎందుకు తప్పించుకు తిరుగుతున్నారు?"

"ఏమీ లేదు. తప్పించుకు తిరగడమేమిటి? అయినా, అడ్డమైనవాడితోనూ గంటల తరబడి కబుర్లు చెబుతూ, గ్యాసు కొడుతూ కాలక్షేపం చెయ్యడమేమిటి? తెలివి తక్కువ కాకపోతే!"

"ఆఁహాఁ, అలాగా" అన్నది కొంచెం ఎగతాళిగా శారద. "ఆయన ఒక్క రోజు కనబడకపోతే, 'వేలు రాలేదే, వేలు రాలేదే' అని కాలుగాలిన పిల్లిలా తిరిగేవారు మీరు. ఉన్నట్టుండి ఈ వాలకం ఏమిటి? ఆయన పేరు చెబితేనే మండిపడుతున్నారెందుకు? ఇంతలో ఏమయింది?"

అనంతరామయ్యకు ఒళ్లు మండింది. "చాల్లే ఊరుకో. వెర్రి ధోరణి ఆపు. అతన్ని చూడకపోతే ఉండలేకపోవడం ఏమిటి? నాన్సెన్స్. అతనేమి నా అమ్మ వెనకవాడా, అబ్బ వెనకవాడా? లేకపోతే తోడబుట్టినవాడా? ఏదో కలిసి ఒకచోట పని చేశామంతే." శారద లేచి భర్త వంక విచిత్రంగా చూస్తూ లోపలికి వెళ్ళిపోయింది. అనంతరామయ్య ఎదురుగా ఉన్న టీపాయ్ మీద మునివేళ్ళతో తబలా వాయించేందుకు కాసేపు ప్రయత్నించాడు. ఆ తరువాత టీపాయ్ కింద అరలో నుంచి ఒక లావుపాటి పుస్తకం తెరిచి అందులో నుంచి ఒక అరఠావు కాగితం ఇవతలకి తీశాడు. ఒకవైపు ఏదో టైపు చేసి ఉంది. రెండోవైపు చూశాడు. తెల్లటి కాగితం మీద ఏదో రాత. అర్థంకాని రాత. అనంతరామయ్య అలా ఆ కాగితంలోకి చూస్తూ ఉండిపోయాడు.

❀ ❀ ❀

బహుశా ఇవాల్టికి నాలుగు రోజుల కిందట, ఉదయం వేళ అనంతరామయ్య పడక కుర్చీలో చేతులు తల కింద పెట్టుకుని హాయిగా కూర్చుని ఉన్నాడు.

టీపాయ్‌కి అవతలివైపు కొళందవేలు మరో కుర్చీలో, ఉండి ఉండి చేతి వేళ్ళు విరుచుకుంటూ, అప్పుడప్పుడూ ఏమీ తోచక ఆవులిస్తూ... ఇద్దరూ రైల్వేలో పనిచేసినవారే.

అప్పటికి దాదాపు రెండు గంటల ముందునుంచీ కబుర్లు, ఒకటే కబుర్లు. వాళ్ళిద్దరూ కలుసుకుంటే కబుర్లకు కొదవ ఉండదు. కొళందవేలు వయసు అరవై రెండు. రిటైరై హాయిగానే కొడుకుతోపాటు ఉంటున్నాడు. భార్య పోయి కొద్ది నెలలే అయింది. అనంతరామయ్య రిటైరై సంవత్సరం కావస్తున్నది. వారి కబుర్లలో సర్వ ప్రపంచమూ ఎదర్కొంటున్న సమస్యలన్నీ చోటు చేసుకునేవి. ఎన్నో విషయాల్లో అభిప్రాయ భేదాలున్నా ఏ ఒక్కరూ పట్టించుకునేవారు కాదు. మాటల్లో పడితే కాలగమనమే తెలిసేది కాదు. ఇహ లోపలి నుంచి భోజనానికి పిలుపు వస్తేనే లేవడం. అప్పుడిక కొళందవేలు లేచి 'వెళ్ళొస్తా' అని బయలుదేరేవాడు.

ఇప్పుడు అనంతరామయ్య చేతిలోని కాగితంలోకి మళ్ళీ చూశాడు. విచిత్రంగా అసహనం పెరిగిపోతున్నది. ఆ కాగితంలో రాసి ఉన్నదేమిటో అతనికి తెలియదు. బహుశా ఎవరికీ తెలియదని కూడా అతని ఉద్దేశం.

ఆనాడు అంతవరకూ మాటలు మాటలు మాటలు. ఇక మాట్లాడేందుకేమీ లేక మౌనంగా కూర్చుని ఉన్నారిద్దరూ. అప్పుడు అనంతరామయ్య లేచి "మరొక చిన్న డోసు కాఫీ సేవిద్దాం" అంటూ లోపలికి వెళ్ళాడు. ఫ్లాస్కులో నుంచి కాఫీ

రెండు స్టీలు గ్లాసులలో ఒంపుకుని ఫ్లాస్కు మూత బిగించి యథా స్థానంలో ఉంచి ముందు గదిలోకి వచ్చాడు. కాఫీ టీపాయ్ మీద ఉంచాడు.

అప్పటికే కొళందవేలు టీపాయ్ కింది నుంచి ఒక అరఠావు కాగితం ఇవతలికి తీసినట్టున్నాడు. దాని మీద ఏవో మాటలు రాశాడు.

కాఫీ తాగుతూ అనంతరామయ్య, "ఏమిటో రాసినట్టున్నావే. కవిత్వమా?" అన్నాడు తమాషాగా.

కొళందవేలు కాగితాన్ని అనంతరామయ్యకు అందించాడు. అదేమిటో అనంతరామయ్యకు అర్థం కాలేదు. "ఏమిటది?" అని అడిగాడు.

కొళందవేలు ఒకచోట వేలు ఉంచి చూపుతూ, "ఈ మాటకు అర్థం తేనె" అన్నాడు.

"మరి, దాని అర్థం ఏమిటి" అని అడిగాడు అనంతరామయ్య మరో మాట చూపుతూ.

"ఇదా? ఇది పంచదార."

అనంతరామయ్యకు చిరాకనిపించింది.

"మరి ఇది. దీని అర్థం ఏమిటి" అన్నాడు కింది మాట చూపుతూ.

"దాని అర్థం చెరకుగడ అని."

అనంతరామయ్యకు కోపం వచ్చింది.

ఆ తర్వాత కొళందవేలు ఆ కింద చూపిస్తూ "ఇది ఒక వాక్యం" అన్నాడు.

"ఆహాఁ! అలాగా? దాని అర్థం ఏమిటో" అన్నాడు కోపంగానే.

"దాని అర్థమా? మా అనంతరామయ్య మనసు తేనె లాగా, పంచదారలాగా, చెరకుగడలాగా తీయన అని."

"ఆఁహాఁ! అలాగేం? ఇదే భాష" అని అన్నాడు అనంతరామయ్య ఎగతాళిగా.

"అది పోర్చుగీసు భాష" అని అన్నాడు కొళందవేలు.

"అయితే, మరో వాక్యం చెబుతాను రాస్తావా ఆ భాషలో" అన్నాడు అనంతరామయ్య లోలోపల ఉడికిపోతూ.

"ఊఁ! చెప్పు. అలాగే రాస్తాను" అంటూ కలం అందుకున్నాడు కొళందవేలు. అలా అంటూ కాగితం కూడా అందుకుని టీపాయ్ మీద పరుచుకున్నాడు.

"ఊఁ చెప్పు" అన్నాడు మళ్ళీ.

అనంతరామయ్యకు ఒళ్ళు మండిపోతున్నది. కోపంగా, "రాయి. నా మిత్రుడు అనంతరామయ్య వట్టి మూర్ఖుడు. అజ్ఞాని. మందమతి."

కొళందవేలు నవ్వుతూ, "అలా రాయడానికి అభ్యంతరం ఏముంటుంది? ఉన్నమాటేగా అది" అంటూ రాశాడు.

"సరిగ్గా నేను చెప్పినట్లు రాశావా?"

"సరిగ్గా నువ్వు చెప్పినట్టే రాశాను."

అనంతరామయ్య విసురుగా లేచాడు. కోపం బుసబుసమని పొంగి వచ్చింది. ఉద్రేకంతో ఊగిపోతూ "చాల్లే నిర్వాకం. ఇట్లా వెర్రివాణ్ణి చెయ్యడానికి నేనే దొరికానా నీకు? పోర్చుగీసు భాషట. నాన్సెన్స్" అని అరిచాడు.

కొళందవేలు అప్పటికీ నవ్వుతూ, "ఎందుకంత కోపం?" అని నసుగుతూ లేచి, "వెళ్ళొస్తా. మళ్ళీ రేపు కలుద్దాం" అంటూ వెళ్ళిపోయాడు.

అనంతరామయ్య నిలువెల్లా వణికిపోతూ నిలబడ్డాడు. ఆ తరువాత లోపలి నుంచి పిలుపు వస్తే అకారణంగా ఆవిడ మీద కేకలు పెట్టాడు. లోపలికి వెళ్ళి ఆవిడ మీద విరుచుకుపడ్డాడు. "నీ దృష్టిలో కూడా నేను పెద్ద ఫూల్ నైనట్టున్నానే" అని అరిచాడు. ఆ తరువాత ముందు గదిలోకి వచ్చి ఆ కాగితాన్ని తీసుకొని మాటిమాటికీ దాన్నే చూస్తూ కాసేపు నిలబడి దాన్ని చించి ముక్కలు ముక్కలు చేద్దామని అనుకుని కూడా మళ్ళీ ఎందుకో ఆ ప్రయత్నం విరమించి, దాన్ని మడిచి టీపాయ్ కింద లావాటి పుస్తకంలో ఉంచేశాడు. తరువాత చాలాసేపు కణతలు నొక్కుకుంటూ కుర్చీలో కూర్చుండిపోయాడు. లోపలి నుంచి కోపం పొంగు లావాలా ఉబికి వస్తుంటే మనిషి నిలువెల్లా అసహనంతో కదిలిపోయాడు. ఆ సాయంకాలమే మళ్ళీ కొళందవేలు వచ్చాడు. "అనంతా! షికారుకు వెళదాం" అంటూ.

అనంతరామయ్యకు అతన్ని చూడగానే ఒంటినిండా తేళ్ళూ, జెర్రులూ పాకినట్టయింది. గుండెల మీద వందల కొద్దీ బొద్దింకలూ, తొండలూ, గొంగళి పురుగులూ, కుమ్మరి పురుగులూ, ఇంకా రకరకాలైన అనామక క్షుద్ర నీచ కీటకాలు షికారు చేస్తున్నట్టనిపించింది.

చాలా విసురుగా, "నాకు వేరే పనుంది. వెళ్ళాలి" అంటూ చెప్పులు తొడుక్కుని హడావిడిగా విసవిసా నడిచి వెళ్ళిపోయాడు. కొళందవేలు ముఖం గుర్తుకు వస్తే చాలు - ఆ ముఖం తప్ప మరొకటేదీ గుర్తుకు రావడం లేదు కూడా - అసహ్యం పుట్టింది. అదేమి చిత్రమో, ఇన్ని ముఖాలుండగా, ఇన్ని దృశ్యాలుండగా, లోకంలో ఇన్ని పదార్థాలుండగా ఆనాటి నుంచీ ఆ ముఖమే కళ్ళ ముందు నిరంతరం ప్రత్యక్షం కావడం చిత్రమే. పైగా 'ఉన్నమాటేగా అది' అన్నమాట చెవుల్లో మారుమోగుతున్నది మళ్ళీ మళ్ళీ. అనంతరామయ్య ఉండి ఉండి పళ్ళు కొరుక్కుంటున్నాడు. 'అంతరంగంలో తన పట్ల ఏహ్యాభావం, కసి, అమిత్రభావం ఉన్న వాడితో కలిసి ఎలా స్నేహం చేశానా' అని మథనపడిపోతూ లోలోపల ఉడికిపోయాడు.

మరునాడు సాయంవేళ రైలుపట్టాలు దాటి, ఊరు దాటి పొలాల మధ్యకు శుభ్రమైన గాలి కోసం వెళితే ఆ తోవలో రిటైర్డ్ రైల్వే డ్రయివర్ బెంజమన్ కనిపించాడు. అతడు ఆంగ్లో ఇండియన్. మంచివాడు.

"ఎట్లా ఉన్నారు బ్రదర్" అని పలకరించాడు ఆప్యాయంగా.

"ఇదుగో ఇట్లా ఉన్నాం" అన్నాడు అనంతరామయ్య.

"ఒక్కరే వచ్చారే ఇవ్వాళ. వేలు సార్ ఊళ్ళో లేడా?"

అనంతరామయ్య ముఖం వివర్ణమైంది. "లేకేం? నిక్షేపంగా ఉన్నాడు రాయిలాగా" అని జవాబు చెప్పి ఊరుకున్నాడు. ఒక్క క్షణం ఆగి, "ఏమిటో బ్రదర్. ఈ లోకం చెడ్డది" అన్నాడు బరువుగా.

బెంజమన్ ఆశ్చర్యంగా చూశాడు.

"అంతే. ఈ లోకంలో ఎవర్నీ నమ్మకూడదు. ప్రతివాడూ పైకి కనిపించేదొక టైపు, లోపల మరొక టైపు. ఎవడి మనసులో ఏముంటుందో తెలుసుకోలేక బోల్తాపడుతూ ఉంటాము. మోసపోతూ ఉంటాము. కానీ, ఎల్లకాలం అలా కుదరదు. ఎప్పుడో ఒకప్పుడు తెలియకుండానే నిజరూపాలు బైటపడిపోతూ ఉంటాయి. అప్పుడిక మన కళ్ళు తెరుపుడు పడతాయి. ఇక రిపెంటెన్స్ మిగులుతుంది మనకు. అంతే."

అనంతరామయ్య ధోరణి బెంజమన్‌కు మింగుడుపడలేదు. అయినా, అతడేమీ మాట్లాడలేదు. చిత్రంగా చూసి అంతలోనే చూపులు తిప్పుకుని వీధి మలుపు తిరిగి. తన దారిన తాను క్వార్టర్స్‌కు వెళ్ళిపోయాడు.

ఇంటికి వెళ్ళగానే శారద ఎదురు వచ్చి "కొళందవేలు కొడుకు ఫోన్ చేశాడు" అన్నది.

"ఏమిటి సంగతి" అంటూ కనుబొమలు ముడిచాడు అనంతరామయ్య.

"ఆయనకు జ్వరం బాగా ఎక్కువైందిట. డాక్టర్లు ఆస్పత్రిలో ఉంచమన్నార్ట" అంటూ మొదలు పెట్టింది.

అనంతరామయ్య 'ఊఁ' కొడుతూనే దుస్తులు మార్చుకొని, పెరటిలోకి వెళ్ళి కాళ్ళు కడుక్కుని వచ్చాడు. "సర్లే సర్లే. భోజనం వడ్డించు" అన్నాడు కొంచెం విసుగుతో.

మరునాడు ఉదయం పదిగంటలు దాటిన తరువాత హాల్లో కూర్చుని ఉన్నాడు అనంతరామయ్య. చేతిలో దినపత్రిక ఊరికే తిరగేస్తున్నాడు. అందులో ఏముందో అసలు బుర్రకెక్కడం లేదు. మనసు ఎటెటో అనంత శూన్యావరణాల్లో విచక్షణా రహితంగా చక్కర్లు కొడుతున్నది.

కాలింగ్ బెల్ కొడుతున్నారెవరో. లేచి వెళ్ళి వీధి తలుపు తీస్తే రామారావు. లోపలికి రాకుండానే వీధిలో నిలబడి, "మీకు తెలియదా ఏమిటి?" అన్నాడు.

"ఏమిటేమిటి?" అన్నాడు అనంతరామయ్య.

"కొళందవేలు పోయాడు. రాత్రి పదిగంట లప్పుడనుకుంటాను. ఇప్పుడే మహాప్రస్థానం వాహనం వచ్చింది. రావలసిన వాళ్ళెవరూ లేరనుకుంటాను. క్రిమేషన్‌కు తీసుకెళ్ళిపోయారు. క్వార్టర్సు కదా, ఎక్కువసేపు ఉంచడానికి వీల్లేదు మరి." ఈ మాటలంటూనే, ఆయన వార్త అందించిన తృప్తితో కాబోలు, విసవిసా నడుస్తూ వెళ్ళిపోయాడు.

అనంతరామయ్య వీధి తలుపు విసురుగా వేశాడు. తరువాత పెద్ద పెద్ద అంగలతో లోపలికి వచ్చి పడక కుర్చీలో పడుకుని గుండెలమీద చేతులుంచుకుని కళ్ళు మూసుకున్నాడు.

మరునాడు సాయంకాలం ఇంటికి వచ్చిన అతిథి లెక్కకు ఒక్కరే గానీ పదిమంది పెట్టు. అంతా హడావిడి, అంతా కోలాహలం. ఆమె ఇరవై అయిదేళ్ళ అమ్మాయి. శారదకు వరసకు చిన్న చెల్లెలవుతుంది. ఎక్కడో ఉత్తరాదిన ఆమెకూ, ఆమె భర్తగారికీ పెద్దపెద్ద ఉద్యోగాలు. ఆమె ఉన్నట్టుండి ముందు గదిలో టీపాయ్ కింద ఉన్న పుస్తకం ఎందుకు తీసిందోమరి, ఆ తరువాత అందులోని ఆ కాగితం ఎందుకు తీసిందో మరి. ఆ కాగితాన్ని చేతబట్టుకుని వచ్చి 'ఎవరు రాశారిది?' అని అడిగింది.

"ఒక ఫ్రెండ్‌లే. ఏవో పిచ్చి రాతలు రాశాడు. నన్ను ఫూల్‌ను చేయడానికి" అన్నాడు అనంతరామయ్య.

"పైగా అది పోర్చుగీసు భాషట. ఏదో పిచ్చిపిచ్చిగా వాగాడు" అని కూడా కలిపాడు.

ఆమె "అవునిది పోర్చుగీసు భాషే" అన్నది ముందు.

"ఇదుగో ఈ మాటకు తేనె అనీ, దీనికి పంచదార అనీ, దీనికి చెరుకుగడ అనీ, ఈ కింది మాటలకు 'మా అనంతరాముడి మనసు తేనెవలె, పంచదారవలె, చెరుకుగడ వలె తీపి' అనీ అర్థం" అంటూ కింద మాటలు చూసి విరగబడి నవ్వింది.

అనంతరామయ్య ఉన్నట్టుండి లేచి నిలబడ్డాడు. కాళ్ళు వణికాయి. వణుకుతున్న కంఠంతో "నిజంగానా? నిజంగానేనా? పోర్చుగీసు భాషేనా అది? అవునా" అన్నాడు. తరువాత శక్తి అంతా హరించుకుపోయినవాడివలె తూలుకుంటూ వెళ్ళి మంచంలో పడిపోయాడు. కళ్ళ ముందు దట్టమైన చీకటి తెరలు దిగినట్టయింది.

❀ ❀ ❀